రోడ్డు ఆక్రమణలను దుకాణదారులే తొలగించాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ బండ్లగూడ నుంచి ఇందూ అరణ్య వరకు ఇరువైపుల రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను ఆయా దుకాణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బండ్లగూడ ప్రధాన రోడ్డులోని దుకాణ యజమానులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని త్వరలో ప్రభుత్వం చేపడుతుందన్నారు. అయితే చాలా మంది దుకాణదారులు 10-15 అడుగుల మేర రోడ్డును ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ జాం ఏర్పడుతుందన్నారు. ఎవరికి వారుగా ఆక్రమణలు తొలగించుకొని సహకరించాలన్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, సుర్వి రాజుగౌడ్, సతీష్, కవిత పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రంగారెడ్డిచే నియామకపత్రం తీసుకుంటున్న నర్సింగ్‌రావు

కాంగ్రెస్ జిల్లా సెక్రటరీగా నర్సింగ్‌రావు నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా సెక్రెటరీగా పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన సీనియర్ నాయకుడు దాసరి నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా నర్సింగ్‌రావు తీసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి, జడ్పీటీసీ దేవదాసుగౌడ్, జైపాల్‌రెడ్డితో పాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీసీ సంక్షేమ సంఘం నేతలు


మధుయాష్కీగౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బ్రహ్మయ్య, వినయ్‌కుమార్

మన్సూరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దవూరె బ్రహ్మయ్య, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌లు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పిన మధుయాష్కీ పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్‌లో చేరుతున్నామని, కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని బ్రహ్మయ్య పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలని మధుయాష్కీ సూచించినట్లు తెలిపారు.

కేపీఎల్ విజేత డీవైజీ జట్టు

● విన్నర్, రన్నర్ జట్లకు నగదు, షీల్డ్‌ల అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కవాడిపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-8 (కేపీఎల్) క్రికెట్ టోర్నీ ముగిసింది. మొత్తం 6టీంలు పాల్గొన్న ఈ టోర్నీలో 2 టీంలు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో డీవైజీ, కేఎస్ఎన్ఆర్ జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో డీవైజీ టీం విజేతగా నిలువగా కేఎస్ఎన్ఆర్ టీం రన్నర్‌తో సరిపెట్టుకుంది. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దూసరి సుజాతయాదయ్యగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విన్నర్, రన్నర్ టీంలకు నగదు బహుమతితో పాటు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్లు, యువత పాల్గొన్నారు.

మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ మీడియా కో-ఆర్డినేటర్‌గా మీర్ ఉమర్‌ఖాన్ నియామకం

సంతోష్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌కు చెందిన మీర్ ఉమర్‌ఖాన్‌ను మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మీడియా కో-ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మీర్ ఉమర్‌ఖాన్ ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీర్ ఉమర్‌ఖాన్ మాట్లాడుతూ తనకు ఈ పదవి అప్పగించడం పట్ల పార్టీ ముఖ్య నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ వైస్ చైర్మన్ అశ్వాక్‌ఖాన్, డీసీసీ మహిళ అధ్యక్షురాలు తహసీన్ సుల్తానా, డివిజన్ అధ్యక్షులు చక్రపాణి, రాహుల్, కిషన్‌సింగ్, సీనియర్ నాయకులు కావేటి రవికుమార్, గంట్లకృష్ణ, మదన్‌బాబు, రాధిక పాల్గొన్నారు.

బాలాజీనగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

మన్సూరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ శ్రీబాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. కాలనీ పెద్దలు టి.శంకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు సాంబిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షుడిగా మందడి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంజి వెంకటేశం, ఉపాధ్యక్షులుగా సీహెచ్ సుధీర్‌రెడ్డి, కోశాధికారిగా టి.శ్రీశైలం, జాయింట్ సెక్రటరీగా బి.మోహన్‌రెడ్డి, కల్చరల్ సెక్రటరీగా డి. ఉమ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్వరలో పూర్తి స్థాయి కమిటీని ప్రకటిస్తామని, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, వెంకటేశం పేర్కొన్నారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు 21శాతం ఫిట్మెంట్ ప్రకటించటాన్ని హర్షిస్తూ ఆదివారం ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయం చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఓల్డ్ మలక్‌పేట కాంగ్రెస్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను పూర్తిగా విస్మరించిందని ఒక్క పీఆర్‌సీకి కూడా నోచుకోలేదని ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి గతంలో ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు మంచిరోజులు వచ్చాయన్నారు. సకాలంలో జీతాలతోపాటు పీఆర్‌సీ, ఉద్యోగుల ఇతర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చౌకి రవికుమార్, మహ్మద్‌గౌస్, ఆకుల రాజు, రామకృష్ణ, సోమయ్య, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ప్రకటనతో ఆర్టీసీ కార్మికుల్లో ఉత్సాహం


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న గడ్డం శ్రీనివాస్ తదితరులు

చాదర్‌ఘాట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ ప్రకటించడంతో కార్మికులు, ఉద్యోగుల్లో ఉత్సాహం వెల్లువిరిసింది. పీఆర్‌సీ ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్‌తో కూడిన బృందం స్వయంగా కలిసి ఘనంగా సన్మానించారు. 2017 పీఆర్‌సీ 21శాతం ప్రకటించి కష్టాల్లో ఉన్న కార్మికుల కళ్లలో ఆనందం కలిగించారన్నారని గడ్డం శ్రీనివాస్ అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణ, రాజయ్యనాయక్ మంత్రిని సన్మానించిన వారిలో ఉన్నారు.

మహిళలు గుండె ధైర్యం కలిగి ఉండాలి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఏదైనా ఆపద వచ్చినప్పుడు మహిళలు ఎదుటి వ్యక్తిని ఎదుర్కొని తమను తాము రక్షించుకునే గుండె ధైర్యం కలిగి ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నదని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లోని నందిహిల్స్ కాలనీలో స్థానిక మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, ఐద్వా ప్రతినిధి బుగ్గవీటి సరళ, రచయిత్రి డి.కమల, న్యాయవాది త్రిపుర, వైద్యురాలు డాక్టర్ సైదా తదితరులతో కలిసి జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రభుత్వాలు కల్పిస్తున్న మహిళా రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని ఆయా రంగాల్లో మహిళలు రాణించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. మేయర్ పారిజాతారెడ్డి మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతలను చూసుకుంటూనే ఇతర రంగాల్లోనూ తమ ప్రతిభ చూపాలని, స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థికంగా ఎదగడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో 9వ డివిజన్ కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతీనర్సింహ, కాలనీ మహిళా కమిటీ ప్రతినిధులు రామిడి జ్యోతీనర్సిరెడ్డి, విజయలక్ష్మి, శ్వేత, అరుణ, రవళి, రజిత, ఉమా, పల్లవి, సౌందర్య, లహరి, సునంద, మంగ, ఝాన్సీ కాలనీ ప్రతినిధులు సురేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కిషన్‌రాథోడ్ పాల్గొన్నారు.


మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణ

మన్సూరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ శ్రీరాంనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరయ్యారు. పురుషులతో సమానంగా మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హరిత ప్రభ, రమయ్య, మూల మోహన్‌రెడ్డి, సత్తయ్య, రవీందర్‌రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో ఎదగాలి: సుధీర్‌రెడ్డి

నాగోల్ డివిజన్ బండ్లగూడలోని సహభావన టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో ఎదగాలని పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మధురానగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ అరుణాసురేందర్ యాదవ్ ప్రారంభించారు.


సరూర్‌నగర్‌లో సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్


సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి ఇతర నాయకులు

సావిత్రిబాయి ఫూలేకు నివాళి

హయత్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి ఫూలే 127వ వర్ధంతిని హయత్‌నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి ఫూలే దంపతుల విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్‌గౌడ్, సీపీఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రాచారి, శేఖర్‌రెడ్డి, సక్రునాయక్, లక్ష్మణ్‌చారి, దళిత సంఘాల నాయకులు ఎర్ర రవీందర్, పొరంద స్వామి, కాంగ్రెస్ నాయకుడు కల్లెం నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ జేబీకాలనీ చౌరస్తాలో సావిత్రిబాయి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం బోర్డు సభ్యుడు బబ్బూరి ఆనంద్‌కుమార్, బీసీ సంఘాల నాయకులు యాంద్ర లోకేష్‌గౌడ్, గొరిగె రాకేష్‌గౌడ్, కబీర్‌దాస్ గౌడ్, శంకర్‌బాబు పాల్గొన్నారు.

కొత్తపేట చౌరస్తాలో..

వర్కర్స్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తపేట చౌరస్తాలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకుడు దండు నిరంజన్, మైనారిటీ నాయకులు, సామాజిక ఉద్యమకారుడు ఎండీ ఇస్మాయిల్ వర్కర్స్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగయ్య ముదిరాజ్, రాష్ట్ర సహకార్యదర్శి కొప్పు యాదయ్య, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శ్రీను, ఎల్బీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ అజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.


మన్సూరాబాద్ సహారారోడ్డులో సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, చామకూర రాజు

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ సహారా రోడ్డులో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూ రాజు తదితరులు హాజరై సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళ్లెం నర్సింహారెడ్డి, కె.వి.గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, అల్లూరి పుల్లయ్య, పృథ్వీరాజ్, నర్సింహ, ఎర్ర మహేందర్, విఠల్ రెడ్డి, రఘుపతి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు శాస్త్రీయ అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నాం

● చీఫ్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ పీ.ఎన్ శర్మ

హయత్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 29వ గనుల పర్యావరణం, ఖనిజ సంరక్షణ వారోత్సవాల ముగింపు సమావేశం ఆదివారం రంగారెడ్డి తుర్కయంజాల్‌లోని వీఎంఆర్ గార్డెన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ పీ.ఎన్ శర్మ (ఇన్‌చార్జి), ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వి. జయకృష్ణ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మైనింగ్ పతాకాన్ని వారు కలిసి ఆవిష్కరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పీ.ఎన్ శర్మ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న గనులను చక్కటి పద్ధతిలో ఉపయోగించుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు శాస్త్రీయ అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్నంత వరకే ఖనిజ సంపద వాడాలన్నారు. వారం రోజులుగా గనుల పర్యావరణం, ఖనిజ సంరక్షణ వారోత్సవాలలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 69 పెద్ద మెకానైజ్డ్, 21 మీడియం లార్జ్ మెకానైజ్డ్, 14 మాన్యువల్ గనులను పరిశీలించామన్నారు. గనుల క్రమబద్ధమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించేందుకు రెండు రాష్ట్రాలలోని మైనింగ్ పరిశ్రమలకు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల బృందాలు 104 గనులను సందర్శించాయి. పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ వారు నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురికి అవార్డును బహూకరించారు. కార్యక్రమంలో రీజినల్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ ఆర్, ఆర్ డొంగ్రేతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సిమెంట్ కంపెనీల యజమానులు, మైనింగ్, పర్యావరణ అధికారులు పాల్గొన్నారు.


సమావేశాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ పి.ఎన్ శర్మ

ఉమా మహేశ్వరస్వామి కల్యాణం నేడు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండరావిరాల గ్రామంలో ఉమా మహేశ్వరస్వామి కల్యాణ, రథోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం 6గంటలకు ఉమా మహేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణం అనంతరం 9 గంటలకు ఎల్లమ్మ చరిత్ర రెండవ భాగం ఉంటుందన్నారు.

మరుసటి రోజు తెల్లవారు జామున రథోత్సవం ఉంటుందన్నారు. శివారు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఈ కల్యాణ వేడుకలకు హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న అధికారులు

హయత్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్మగల్ హయత్‌నగర్‌లోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 255లో రెండు రోజులుగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను ఆదివారం మధ్యాహ్నం హయత్‌నగర్ మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహయాదవ్ నేలమట్టం చేశారు. రెండు రోజులు మహా శివరాత్రి సెలవులు రావడంతో ముదిరాజ్ కాలనీ అనుకుని కొంత మంది ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇళ్లను నిర్మిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు భారీ వాహనాలను అడ్డం పెట్టి ఎవరికి కనిపించకుండా ఇంటి నిర్మాణం చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఆర్ఐ రెవిన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. దీంతో స్థానికులు తాము ప్లాట్లు కొనుగోలు చేశామంటూ ఆర్ఐపై విరుచుకుపడ్డారు. కూల్చివేతలను ఆపాలని వాగ్వివాదం చేశారు. నానా బూతులు తిడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐనప్పటికీ రెవిన్యూ సిబ్బంది అక్రమాలను నేలమట్టం చేశారు. ఆర్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

చైతన్యపురిలో నిరుద్యోగుల దీక్షను భగ్నం చేసిన పోలీసులు

● స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన నిరుద్యోగులు
● అరెస్ట్.. సొంత పూచీకత్తుపై విడుదల

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జీవో 46 రద్దు చేయడంతో పాటు, గ్రూప్1,2,3 పోస్టులను పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు ఆదివారం చేపట్టిన చలో నిరుద్యోగ మార్చ్ ఆందోళనలకు దారితీసింది. చలో నిరుద్యోగ మార్చ్ పేరిట ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న మహా నిరాహారదీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, దీక్ష స్థలిని చైతన్యపురికి మార్చారు. చైతన్యపురి ఖజానా జ్యువెల్లర్స్ సమీపంలోని అశోక్ ఆన్‌లైన్ అకాడమి వద్ద నిరుద్యోగులు దీక్షకు దిగారు. అనుమతి లేకుండా దీక్ష చేపట్టిన విషయం తెలుసుకున్న చైతన్యపురి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దీక్ష విరమింపచేయాలని వారికి నచ్చజెప్పారు. అయినప్పటికీ వారు వినకపోవడంతో అశోక్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు అశోక్ సహా దీక్షకు దిగిన సుమారు 15 మంది ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించారు.

విడుదల చేయాలంటూ పోలీస్ స్టేషన్‌ల ఎదుట ఆందోళన

అయితే అశోక్‌తో సహా 15 మందిని వెంటనే విడుదల చేయాలంటూ నిరుద్యోగులందరూ సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.


చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

సుమారు 200 మంది వరకు స్టేషన్ ఎదుట గుమ్మిగూడడంతో ఆందోళనకర వాతావరణం నెలకొంది. వారిని వదిలేవరకు స్టేషన్ ముందు నుంచి కదిలేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. అయితే సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఆందోళనకారులెవరు లేరని వివరించారు. చివరకు అక్కడ లేరని నిర్ధారణకు వచ్చిన తరువాత వారంత అక్కడ నుంచి ర్యాలీగా చైతన్యపురి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. చివరకు అదుపులోకి తీసుకున్న 15 మందిని సొంతపూచీకత్తుపై పోలీసులు విడుదల చేయడంతో ఆందోళన సద్దుమణిగింది.

అన్నదానం

చంపాపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయం ఎదురుగా ఆదివారం అమావాస్యను పురష్కరించుకొని మాతా అన్నపూర్ణేశ్వరీ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ భగవాన్ ఆధ్వర్యంలో ప్రజలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రవి ముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోష్‌లడ్డ, ప్రవీణ్, వెంకటేష్, చింటూ, రాజు, శ్రీనివాస్, షానవాజ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్యను పురష్కరించుకొని ఆదివారం 500మంది ప్రజలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమావాస్య అన్నప్రసాద వితరణ కమిటీ అధ్యక్షుడు విజయనాథ్, డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరే రవీందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్‌గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీశైవ క్షేత్రంలో..

ఎల్బీనగర్ : అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. అమావాస్య సందర్భంగా ఆర్‌కేపురంలోని శ్రీశైవ క్షేత్రంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు పంచలింగాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైవ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు కోటేశ్వర్‌రావు, వనిత శక్తి అధ్యక్షురాలు హైమ, రమేష్‌గుప్తా, సీతారాం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


చంపాపేటలోని నల్లపోచమ్మ ఆలయం ఎదురుగా అన్నదానం చేస్తున్న మాతా అన్నపూర్ణేశ్వరీ ట్రస్ట్ చైర్మన్


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, సురేందర్‌రెడ్డి

మోదీ గ్యారెంటీ ప్రచార రథం ప్రారంభం

చాదర్‌ఘాట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వివరించే మోదీ గ్యారెంటీల మొబైల్ ప్రచార రథాన్ని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. వికసిత్ భారత్ సంకల్ప పత్రం కోసం ప్రజల సలహాలను సేకరిస్తున్నట్లు సురేందర్‌రెడ్డి వివరించారు. మూసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్, ఎస్బీఐ ఆఫీసర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో మొబైల్ ఎల్ఈడీ స్క్రీన్ ప్రచార రథాన్ని ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి నందడి సురేందర్‌రెడ్డి, తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, జెక్కా మోహన్‌రెడ్డి, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, రమాదేవి, తులసి పాల్గొన్నారు.

సంత్ ఆశారామ్ బాపూను విడుదల చేయాలి

ఎల్బీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంత్ ఆశారామ్ బాపూ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తక్షణమే విడుదల చేయాలని శ్రీయోగా వేదాంత సేవా సమితి హైదరాబాద్ ఇన్‌చార్జి విజయ్ పరిఖ్ కోరారు. ఆదివారం శ్రీయోగా వేదాంత సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తపేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ పరిఖ్ మాట్లాడుతూ తప్పుడు ఆరోపణలతో జోధ్‌పూర్ జైలులో ఉన్న 86ఏళ్ల ఆశారామ్ బాపూ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆశారామ్ బాపూను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ ర్యాలీలో శ్రీయోగా వేదాంత సేవా సమితి సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రత్యంగిరా ఆలయాన్ని దర్శించుకున్న జవహర్‌రెడ్డి


ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న జవహర్‌రెడ్డి

ఎల్బీనగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి ఆదివారం ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని పూజలో పాల్గొన్నారు. ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు జవహర్‌రెడ్డికి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం జవహర్‌రెడ్డి వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గంపా జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, వాసవీక్లబ్ అధ్యక్షుడు ఉప్పల వరకుమార్, కార్యవర్గసభ్యులు ఓరుగంటి సుధాకర్ పాల్గొన్నారు.

ఉరేసుకుంటున్నానంటూ డయల్ 100కు ఫోన్ సీపీఆర్ చేసి కాపాడిన పోలీసులు


సీపీఆర్ చేస్తున్న పోలీసులు

సరూర్‌నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు.. ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకోవడానికి అంతా సిద్ధం చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ డయల్ 100కు ఫోన్ చేశాడు.. వెంటనే స్పందించిన పోలీసులు అక్కడకు చేరుకుని కొనఊపిరితో ఉన్న సదరు వ్యక్తిని సీపీఆర్ చేసి కాపాడారు. ఈ సంఘటన రాచకొండ కమిషనరేట్‌లోని మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం... బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్‌కు చెందిన జగన్ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. శనివారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు లుంగీ కట్టి ఉరేసుకోవడానికి సిద్ధపడి డయల్ 100కు ఫోన్ చేశాడు. అక్కడి సిబ్బంది మీర్‌పేట్ పోలీసులకు సమాచారంతో పాటు లొకేషన్‌ను పంపించడంతో కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, రమావత్ రవి, నాగరాజు, హోంగార్డు నర్సింహ సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే జగన్ ఉరేసుకోగా, కిందకు దింపి సీపీఆర్ చేశారు. తరవాత ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అతడికి ప్రాణాపాయం లేదని, కోలుకుంటున్నాడని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ చెప్పారు. జగన్‌ను కాపాడిన పోలీసులకు అతడి కుటుంబసభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. రాచకొండ కమిషనర్, ఇతర పోలీసు అధికారులు వారిని అభినందించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

చంపాపేట, మార్చి 10(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ అనుపమానగర్‌కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 11నుంచి 13వరకు హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో చతుర్థ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 11న ఉదయం 8గంటలకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, వాస్తు, యోగినీ, పూర్యనారాయణస్వామికి అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, సాయంత్రం 4గంటలకు మండప పూజలు, రుద్ర హోమం, శివపార్వతి కల్యాణం, 12న ఉదయం 8గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి అభిషేకం, చండీహోమం, మండప పూజలు, సాయంత్రం 5గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, 13న ఉదయం 8గంటలకు 108కలశాలతో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి అభిషేకం, మహాసుదర్శన సహిత లక్ష్మీ, నారాయణ మూలమంత్ర సహిత నారాయణ శ్రీ సూక్త భూసూక్త హోమం, మహాపూర్ణాహుతి, వేద ఆశీర్వచనం, పండిత సత్కారం, మండప పూజలు, సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. పరిసర కాలనీల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ తెలిపింది.